## 2న ఆధ్యాత్మిక గురువు సంత్ తుకుడోజి మహారాజ్ పుణ్యతిథి



మాట్లాడుతున్న మాణిక్ రావ్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 30: నవంబర్ 2వ తేదీన ఆధ్యాత్మిక గురువు సంత్ తుకుడోజి మహారాజ్ పుణ్యతిథి అమరావతి జిల్లా మోజరిలోని గురు కుంజ్ ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు తుకుడోజి మహారాజ్ భక్త మండలి జిల్లా అధ్యక్షులు మాణిక్ రావ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం వివరాలు తెలిపారు. జిల్లా నుంచి మహారాజ్ భక్తులు, శిష్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో బండారి దేవన్న, రామారావ్ పాల్గొన్నారు.

## భార్యపై డీజిల్ పోసి నిప్పంటించి..

- హతమార్చేందుకు భర్త ఘాతుకం
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఎదులాపురం, అక్టోబర్ 30: భార్య శరీరంపై డీజిల్ పోసి నిప్పంటించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మావల ఎస్‌ఐ రహమత్‌ఉల్లా తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన పెండెపు అడెల్లు 20 ఏండ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో తరచూ భార్య లక్ష్మితో గొడవ పడుతుండే వాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఇంట్లో దంపతులిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే సోమవారం ఉదయం 4 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న భార్యపై డీజిల్ పోసి నిప్పంటించాడు. ఆమె కేకలు వేయడంతో పక్కనే ఉన్న కొడుకు, చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. వెంటనే మంటలు ఆర్పివేశారు. ఆ తర్వాత గాయపడ్డ ఆమెను వెంటనే రిమ్స్ దవాఖానకు తరలించారు. లక్ష్మి భుజానికి, చేతికి గాయాలైనట్లు సానికులు తెలిపారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతున్నదని చెప్పారు. అయితే భర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మహదాపూర్‌లో మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న మహిళలు



కిలోమీటర్ల దూరం నుంచి నెత్తిన బిందెలతో వస్తున్న మహిళలు(ఫైల్)

# తాగునీటి తండ్లాటకు చెక్

- ఉమ్మడి రాష్ట్రంలో క'న్నీటి' కష్టాలు
- కిలోమీటర్ల దూరం నడక
- పట్టని పాలకులు
- స్వరాష్ట్రంలో తీరిన తిప్పలు
- ఇంటివద్దకే నల్లా నీరు

నార్నూర్, అక్టోబర్ 30: నార్నూర్ మండలం ఖంపూర్ పంచాయతీ పరిధిలో మహదాపూర్ గ్రామం 1962 వ సంవత్సరంలో ఏర్పడింది. అప్పటి నుంచి 72కుటుంబాలు నివాసముంటున్నాయి. గతంలో ఏ ప్ర భుత్వం అధికారంలోకి వచ్చినా ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉండేది. గ్రామంలో తాగు నీరు లభించక, కలుషిత నీటిని తాగుతూ ఎంతో మంది అనారోగ్యం బారిన పడ్డారు. ఓట్ల కోసం వచ్చి అది చేస్తా.. ఇదీ చేస్తానూ అంటూ మాయమాటలు చెప్పి, గెలిచిన తర్వాత కనీసం ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడని నేతలు ఉండేవారు. చిన్నాపెద్ద తేడా లేకుండా తాగునీటి కోసం కిలో మీటర్ల దూరం వెళ్లి, నెత్తిన బిందెలతో కాలినడకన తాగు నీటిని తీసుకొచ్చి దాహం తీర్చుకున్న దుర్భర పరిస్థితి ఉండేది. వేసవిలో తాగునీటి కోసం ఆ గ్రామం పడే కష్టాలు మరింత దారుణంగా ఉండేవి. వారి పరిస్థితిని చూడలేక అప్పట్లో నార్నూర్ పోలీసులు పురాతన బావికి జేసీబీ ద్వారా మరమ్మతు చేయించారు. ఇక ఇదంతా గతం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిషన్ భగీరథ పథకం ద్వారా వాటర్ ట్యాంకులు నిర్మించింది. ఇంటింటికీ నల్లాలు బిగించింది. శుద్ధమైన నీటిని సరఫరా చేస్తున్నది. ప్రస్తుతం ఆ గ్రా మంలో మిషన్ భగీరథ ద్వారా నీరు అందుతుండడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. గతంలో గుక్కెడు నీటి కోసం ఎన్నో కష్టాలు పడ్డామని మళ్లీ ఆరోజులు రావొద్దు అంటూ మహిళలు చెబుతున్నారు.



పురాతన బావికి మరమ్మతు చేయిస్తున్న పోలీసులు(ఫైల్)

### ఆనారోగ్యంతో బాధపడే వాళ్లం..



గతంలో తాగునీటి కోసం చాలా ఇబ్బంది పడేటోళ్లం. కిలో మీటర్ల దూరం నుంచి నీళ్లు తీసుకొచ్చేటోళ్లం. కలుషితమైన నీళ్లు తాగి ఆనారోగ్యంతో బాధపడేటోళ్లం. బీఆర్‌ఎస్ సర్కారు వచ్చాక మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయి. గిప్పుడు ఆ పరిస్థితి లేదు. మంచినీళ్లు పుల్లుగా వస్తున్నయ్. సీఎం కేసీఆర్‌కు దండం పెట్టాలె.

-కాంబ్లే గంగాబాయి, మహదాపూర్

### కిలోమీటర్ల దూరం నడిసి పోయేది..




గతంలో గుక్కెడు నీళ్ల కోసం చాలా అవస్థలు పడ్డాం. మా ఊరు సమీపంలో పురాతన బావి ఉండేది. గుట్టెక్కి కాలినడనక బిందెలతో నీళ్లు తీసుకొచ్చేది. గతంలో ఎవరికి చెప్పినా పట్టించుకోలే. తెలంగాణ సర్కారులో వాటర్ ట్యాంక్ కట్టిన్రు. పుష్కలంగా నీళ్లు వస్తున్నయ్. గప్పటి పరిస్థితి గిప్పుడు లేదు. చాలా సంతోషంగా ఉంది.

-కాంబ్లే దైవశాల, మహదాపూర్

# కాంగ్రెస్‌వి బూటకపు హామీలే..

**మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్**

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 30: కాంగ్రెస్‌వి బూటకపు హామీలేనని, కర్ణాటకలో కూడా ఇలానే ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరించారు. ప్రచారంలో కలిసిన వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే పరమావధిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ బుట్టదాఖలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బూటకపు హామీల కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పనున్నారని స్పష్టం చేశారు. రైతులకు సైతం మూడు గంటల విద్యుత్ సరిపోతుందన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆ పార్టీ విధానాలకు నిదర్శనమని అన్నారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అలాల్ అజయ్, అడప తిరుపతి, ఇబ్బు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్‌ఎస్ నాయకులు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## ఉట్నూర్‌లో పోలీసుల కవాతు

ఉట్నూర్,అక్టోబర్ 30: మండల కేంద్రంలో సోమవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక్ చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు పోలీస్‌ల కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పట్టణానికి ప్రత్యేక బెటాలియన్లు వచ్చాయన్నారు. ఇందులో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనేలా చూస్తామని చెప్పారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ మనోహర్, సిబ్బంది ఉన్నారు.

## ఆకట్టుకున్న బతుకమ్మ వేడుకలు

తలమడుగు మండలకేంద్రంలో సోమవారం బతుకమ్మ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి డప్పుచప్పళ్లతో, డీజే నృత్యాలతో గ్రామాల్లోని పలు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ గ్రామ సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

*-తలమడుగు, అక్టోబర్ 30*



తలమడుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తలమడుగులో బతుకమ్మతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు



తలమడుగులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళలు